ఆధ్యాత్మిక సుగంధం

జగద్గురు పీఠం



హాజరైన విదేశీయులు(ఫైల్)

సనాతన ధర్మ వ్యాప్తిలో కీలకభూమిక

ఆకర్షితులవుతున్న విదేశీయులు

తాటిచెట్లపాలెం: సనాతన ధర్మాన్ని , భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను విదేశాల్లో సైతం వివరిస్తూ ఆధ్యాత్మిక సుగంధాలను వ్యాప్తి చేస్తోంది జగద్గురుపీఠం. మాస్టర్ ఇ.కె. ఆశయాలకనుగుణంగా జగద్గురుపీఠం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సనాతన ధర్మాన్ని వివరించడంలో కీలక భూమిక పోషిస్తోంది. దీంతో మన దేశీయులే కాకుండా విదేశీయులు సైతం మాస్టర్ ఇ.కె. రచనలకు ఆకర్షితులవుతున్నారు. సనాతన ధర్మాన్ని ఆచరిస్తున్నారు.

విశాఖ వాలిపోయిన విదేశీయులు

మాస్టర్ ఇ.కె. రచనలతో పాటు భారతీయ సనాతన సంప్రదాయానికి ఆకర్షితులైన విదేశీయులు ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన 64వ మాస్టర్ సీవీవీ గురుపూజా మహోత్సవాల్లో పాల్గొన్నారు. స్పెయిన్, జర్మనీ, స్విట్జర్లాండ్‌ల దేశాల నుంచి సుమారు రెండు వేల మంది సాధకులు, విదేశీయులు హాజరయ్యారు. మూడు రోజులు ఉదయం సాయంత్రం వేళల్లో నిర్వహించిన గురు ప్రార్థనలు, రుద్రాభిషేకం , సామూహిక లలితా సహస్రనామ పూజ, లక్ష్మీనారాయణ పూజ, నారాయణ హోమాలకు పరవశించిపోయారు.

పుస్తకాల ఆవిష్కరణ

పూజా మహోత్సవాల సందర్భంగా కులపతి బుక్ ట్రస్ట్ ప్రచురించిన మాస్టర్ ఇ.కె. లలితా సహస్రనామ రహస్య ప్రకాశం, బుక్ ఆఫ్ స్పిరిచ్యువల్స్, మాస్టర్ ఇ.కె.ఐరోపా పర్యటన అనే పుస్తకాలతో పాటు ధనిష్టా ఫౌండేషన్ ముద్రించిన మాస్టర్ పార్వతీకుమార్ రచించిన భారతీయ సంప్రదాయం, అక్కల్ట్ మెడిటేషన్స్ అనే రెండు పుస్తకాలు కూడా ఆవిష్కరించారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు విదేశాల నుంచి వచ్చిన సుమారు 22 మంది ప్రతినిధుల బృందం నగరంలోని మాస్టర్ ఇ.కె. హోమియో వైద్యాలయం, రాధా మాధవం,



తాటిచెట్లపాలెంలోని జగద్గురుపీఠం కార్యాలయం



ఉత్సవాలకు హాజరైన ప్రతినిధులు(ఫైల్)

మాస్టర్ ఇ. కె సంస్కృతి సదన్‌లను సందర్శించి పులకించిపోయింది. యూరోపియన్ దేశాల నుంచి వచ్చిన విదేశీయులు తమ అనుభవాలను పంచుకుని మురిసిపోయారు.

పీఠం కార్యక్రమాల్లో 26 సార్లు పాల్గొన్నా



జగద్గురుపీఠం నిర్వహించే భౌగోళిక సాధకుల ఆధ్యాత్మిక సమ్మేళన కార్యక్రమంలో ఇప్పటివరకు 26 సార్లు పాల్గొన్నాను. భారతీయ జీవన శైలి, సంప్రదాయాలు, ప్రాచీన గ్రంథాల సత్యపరమైన విషయాలను సదస్సుల ద్వారా నేర్చుకున్నాను. మాస్టర్ పార్వతీకుమార్ విదేశాల్లో చేసిన ప్రసంగాలు నన్నెంతగానో ఆకర్షించాయి.. సంస్కరించాయి. ఆయన రచించిన టీచింగ్స్ ఆఫ్ సనత్కుమారా, శంబల అనే ఆంగ్ల గ్రంథాలు నాకెంతో స్ఫూర్తినిచ్చాయి. అక్కల్ట్ హీలింగ్ అనే పుస్తకాన్ని నేనే స్పానిష్ భాష లోనికి తర్జుమా చేశాను. – డాక్టర్ డోనా, బార్సిలోనా

మా ఇంట్లో శ్రీకృష్ణుడి విగ్రహం పెట్టుకున్నాం



ఇప్పటివరకు పలు సార్లు భారతదేశంలో అనేక ప్రాంతాలను సందర్శించాం. పరమ గురువుల బోధనలు విశ్వజనీయం. మాస్టర్ సీవీవీ నేర్పించిన యోగా మార్గాన్ని అనుసరిస్తూ ఆనందంగా జీవితాన్ని గడుపుతున్నాం. మా దేశంలోని మా గృహంలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని 2010లో మాస్టర్ పార్వతీకుమార్ ఆవిష్కరించారు. ఈ మధుర ఘట్టాన్ని ఎప్పటికీ మరచిపోలేం.

– మైఖేల్, స్పెయిన్

యోగాతో ఆధ్యాత్మిక జీవనం



ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో స్వధర్మాచరణతో పాటు ఆధ్యాత్మిక జీవనాన్ని పొందేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుంది. భారతీయ సంప్రదాయ గ్రంథాల్లో ఉన్న తత్వ జ్ఞానాలు, ఉపాసనలు మా ఉన్నతికి సహకరిస్తున్నాయి. జగద్గురుపీఠం నిర్వహించిన ఈ గురుపూజ ఉత్సవాల్లో పాల్గొనడం, ఈ ప్రాంతాలను దర్శించడం చాలా సంతోషంగా ఉంది. – ఫ్రెడరిక్, ఫ్రెంచ్

స్విట్జర్లాండ్ నుంచి వచ్చా..



ఇప్పటివరకు 24 సార్లు జగద్గురుపీఠం నిర్వహించే గురుపూజా ఉత్సవాల్లో పాల్గొన్నాను. ఈ సంవత్సరం కూడా నిర్వహించిన గురుపూజ ఉత్సవాలకు స్విట్జర్లాండ్ నుంచి వచ్చాను. కుల మతాతీతమైన ఆధ్యాత్మిక ప్రబోధాలకు ఆకర్షితుడినయ్యాను.

– లుడ్గర్ ఫిలిప్స్, స్విట్జర్లాండ్

ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆలయం కూల్చివేత



టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేసిన ఆలయం

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించిన ఆలయాన్ని శుక్రవారం జోన్–3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. ఇక్కడ కొంత కాలం కిందట ఒక వ్యక్తి ఆంజనేయస్వామి ఆలయం నిర్మించి పూజలు చేస్తున్నారు. ఈ నిర్మాణం మీద ఫిర్యాదులు అందడంతో టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది శుక్రవారం ఆలయాన్ని కూల్చివేశారు.

కూల్చివేత అన్యాయం

బీజేపీ ధార్మిక సెల్ కో కన్వీనర్ విజయశంకర్ ఫణీంద్ర మీడియాతో మాట్లాడుతూ హిందూ మతం మీద దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవీఎంసీ జోన్–3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నోటీసులు ఇవ్వకుండా ఆలయం కూల్చివేయడం దారుణమన్నారు.

రక్తదాన శిబిరం రేపు

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్–3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు, విశాఖ వివేకానంద యువ మహామండలి ఆధ్వర్యంలో వివేకానందుడి 162వ జయంతి సందర్భంగా 23వ స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ఉపాధ్యక్షుడు జీవీ రత్నం, వీవీవైఎం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పార్కులోని స్వామి వివేకానంద మండపంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఏఎస్ రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో నిర్వహిస్తామన్నారు. రక్తదాతలకు డోనర్ కార్డు, సర్టిఫికెట్ అందిస్తామన్నారు. 7893812701, 8333820666, 8008927268 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

ఘనంగా చందనోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మర్రిపాలెం: హజ్రత్ ఖాజా నవాజ్ చందనోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 53వ వార్డు మర్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్ మసీదులో ఆల్ ఖదీర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఖురాన్ పఠించి , మధ్యాహ్నం పవిత్ర నమాజ్‌ను ఆచరించారు. సాయంత్రం చాదర్(పవిత్ర వస్త్రం) ప్రదర్శిస్తూ చిన్నారులు శాంతి ర్యాలీ నిర్వహించారు. మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ నిషానీ షరీఫ్ వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో దావత్ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో ‘బైక్ రెంటల్స్’ ప్రారంభం



రైల్వేస్టేషన్‌లో బైక్ రెంటల్స్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, సందర్శకుల సౌకర్యార్థం బైక్ రెంటల్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. రాధాకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత కె. వంశీ మాట్లాడుతూ విశాఖకు రైలు మార్గం ద్వారా ప్రతీరోజు వందలాది మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని, వీరిలో కొందరు ఉదయం వచ్చి పనులు చూసుకుని సాయంత్రం, లేదా రాత్రికి తిరిగి వెళ్లిపోవాలనుకుంటారన్నారు. వారి సౌకర్యార్థం విశాఖ రైల్వేస్టేషన్‌లో గేట్ నెంబర్ –1,3ల వద్ద బైక్ రెంటల్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యువకుడి అదృశ్యంపై దర్యాప్తు



కిషోర్

ఎంవీపీకాలనీ: నంద్యాల జిల్లా రహిమాన్‌పురం గ్రామానికి చెందిన యాదవబోయిని కిషోర్ (16) అదృశ్యంపై కేసు నమోదైంది. హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న కిషోర్ ఈనెల 22న ఉదయం 11 గంటలకు కర్నూల్ రైల్వేస్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లడానికి రైలు ఎక్కాడు. అయితే కిషోర్ కాలేజీకి చేరలేదని సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు కర్నూలు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే కిషోర్ 22వ తేదీ రాత్రి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో విశాఖపట్నం వెళ్లే 12862 నంబర్ ట్రైన్ ఎక్కినట్లు పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించారు. కిషోర్ విశాఖపట్నం చేరినట్లు వెల్లడించారు.ఆచూకీ తెలిసిన వారు 94418 02327 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఒలింపియాడ్‌లో శ్రీ విశ్వ విద్యార్థుల సత్తా



ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీవిశ్వ యాజమాన్య ప్రతినిధులు

సీతమ్మధార: ప్రతిష్టాత్మకమైన జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో విశాఖలోని శ్రీ విశ్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల డైరెక్టర్ ఏఆర్‌కే శివాజీ తెలిపారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన నేషనల్ సైన్స్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో శ్రీ విశ్వకు చెందిన విద్యార్థులు సెకెండ్ లెవల్‌కు ఎంపికయ్యారని వెల్లడించారు. ఐఎంవో సెకెండ్ లెవల్‌కు 3వ తరగతి నుంచి బి.సహస్ర సిరి, 4 నుంచి బి.కార్తికేయ, రియా సాహు, 5వ తరగతి నుంచి కె.శ్యావాళ్య, కె.రేణుక, వి.కుషాల్ సుహాస్, 6 నుంచి ఎ.నిహాల్, 8వ తరగతి నుంచి వి.జశ్విక ఎంపికయ్యారని తెలిపారు. అదేవిధంగా ఎన్‌ఎస్‌వో సెకెండ్ లెవెల్‌కు 3వ తరగతి నుంచి బి.సహస్రసిరి, 5వ తరగతి నుంచి వి.కుషాల్ సుహాస్, 6 నుంచి ఎ.నిహాల్, 7 నుంచి పి.అనీష్, 8వ తరగతి నుంచి కె.తన్మయశ్రీ ఎంపికయ్యారని డైరెక్టర్ వివరించారు. ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని శ్రీ విశ్వ డే క్యాంపస్‌లో చైర్మన్ ధర్మరాజుతో పాటు ప్రిన్సిపాల్ పి.శివజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఈ.వరలక్ష్మి అభినందించారు.


సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: ఆరోగ్యశ్రీ పథకంలో కవరేజీ లేని రోగులకు చికిత్స తర్వాత ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తామని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదల చేసిన చెక్కులను అరుగురు బాధితులకు పంపిణీ చేశారు. 44వ వార్డుకు చెందిన పి.కల్పనకు రూ.69వేలు, 14వ వార్డుకు చెందిన జ్యోతికి రూ.81వేలు, 25వ వార్డుకు చెందిన టి.రాముకి రూ.40వేలు, 25వ వార్డుకు చెందిన కె.చంద్రరావుకి రూ.25వేలు, 50వ వార్డుకు చెందిన ఎస్.సత్యలక్ష్మికి రూ.25 వేలు, 54వ వార్డుకు చెందిన పి.సురేష్‌కుమార్‌కు రూ.1.23 లక్షల వంతున మొత్తం రూ.3.63లక్షలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

చదువుతోనే ప్రగతి



బాలికా దినోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్త గౌరి

సీతమ్మధార: ఆడపిల్లను రక్షించాలి.. చదివించాలి అనే సంకల్పం అందరిలోనూ రావాలని అంగన్‌వాడీ కార్యకర్త గౌరి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత, రక్షణ కోసం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. విద్యార్థి దశ నుంచి బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు బాలలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని వారి భవిష్యత్తు కు బంగారు బాటలు వేయాలన్నారు. బాలలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నా చైల్డ్ లైన్ 1098కి లేదా పోలీసు 112 కి తెలియజేయాలన్నారు. కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు కోమలి, సచివాలయ మహిళా సంరక్షణాధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ లైబ్రరీ



ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల మొక్కలు



సీతంపేట: ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయాన్ని గ్రీన్ లైబ్రరీగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రతి రోజూ 800 మందికి పైగా విద్యార్థులు ఇక్కడకు వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటారు. అలాగే మీటింగ్ హాల్స్‌లో రోజూ జరిగే సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో మంది వస్తుంటారు. వీరందరికీ ఆహ్లాదకరమైన, ఆరోగ్య కరమైన వాతావరణం కల్పించడానికి పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ చర్యలు చేపట్టారు. లైబ్రరీలో ప్రవేశ ద్వారాలు, లాబీలు, బాల్కనీలు, సిట్ అవుట్స్,ఎలివేషన్, విద్యార్థులు చదువుకునే టేబుల్స్‌పై ఆకర్షణీయమైన రీతిలో పలు రకాల ఆక్సిజన్ ప్లాంట్స్, ఇండోర్ ప్లాంట్స్,డెకరేషన్ ప్లాంట్స్, హ్యాంగింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇక్కడ చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి వివిధ రకాల ప్లాంట్స్ ఏర్పాటు చేశామని లైబ్రరీ సొసైటీ సెక్రటరీ వర్మ తెలిపారు. బాల్కనీలు, ఎలివేషన్‌పై ఏర్పాటు చేసిన హ్యాంగింగ్స్ పెరగడానికి ఆర్నెల్లు పడుతుందని, మొక్కలు పూర్తిగా ఎదిగితే అందంతో పాటు బయట నుంచి వేడి లోపలకు రాకుండా మొక్కలు అడ్డుకుంటాయని చెప్పారు.

నిల్వ నీటిలో దోమలు వృద్ధి



గణేష్‌నగర్‌లో నీటి నిల్వలను పరిశీలిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ రత్నం

సీతంపేట: మలేరియా,డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ పి.వై.ఎస్.రత్నం అన్నారు. జీవీఎంసీ 25వవార్డు గణేష్‌నగర్‌లో ఫ్రైడే డ్రైడే అమలు తీరును పరిశీలించారు. సిబ్బందితో ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి దోమ లార్వాలు పెరుగుతున్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులకు పైగా నిల్వ ఉన్న మంచినీటిలో దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. వారానికి ఒక రోజు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకుల్లో నీటిని తొలగించాలని సూచించారు. అనంతరం అంగనవాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎం గ్రేసీ, ఆశాకార్యర్త ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నా కొడుకును రప్పించండి

- తల్లి వేడుకోలు



కేఏ పాల్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ

సీతమ్మధార: అమెరికా జైలులో ఉన్న తన కుమారుడిని విడుదల చేయించి తన కుటుంబానికి న్యాయం చేయాలని తల్లి అప్పలకొండ కోరారు. ఆమె శుక్రవారం ఆశీలమెట్టలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు కేఏ పాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తన కుమారుడు ఓ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో చదువుకున్నాడని.. రూ.10 లక్షలు చెల్లించి అమెరికాలో ఉద్యోగం నిమిత్తం వెళ్లాడని తెలిపారు. అక్కడ ఒక కేసులో చిక్కుకుని గతేడాది ఆగస్టులో జైలుపాలయ్యాడని కన్నీటిపర్యంతం అయ్యారు. ఎంత ప్రయత్నించినా అటు నుంచి సమాధానం రాలేదని చెప్పారు. తన కుమారుడిని రప్పించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను రెండు సార్లు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోలేదని కన్నీరుమున్నీరయ్యారు.

ఘనంగా భూలోకమాత పరస



భూలోకమాత అమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 24వార్డు పాత రేసపువానిపాలెంలోని భూలోకమాత అమ్మవారి పరస మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కాలనీ పరిసర ప్రాంతాల్లో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సేవాసంఘం కార్యవర్గ సభ్యులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. పరస కారణంగా కాలనీ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

బాలికల అభ్యున్నతికి సహకారం అందించాలి



ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో రమణకుమారి,సిబ్బంది

మర్రిపాలెం: బాలికల అభ్యున్నతికి అంతా సహకారం అందించాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణ కుమారి అన్నారు. జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్‌బీజంక్షన్ సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలే మనం మన బాలికలకు ఇచ్చే నిజమైన గౌరవం అన్నారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అవగాహన పెంచడానికి ప్రతి ఏటా జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవం నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీలత, సూపర్ వైజర్లు జ్యోతి,కుమారి,వరలక్ష్మి,సైకాలజిస్ట్ పార్వతీకశ్యప్,డేవిడ్ రాజు,మేనేజర్ సుజాత,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రిపాలెం: బాలికల్లో కిశోర దశలో నెలకొనే భావోద్వేగ పరిస్థితుల్లో వారికి చక్కటి మార్గదర్శకం కల్పిస్తే జీవితంలో అన్నివిధాలుగా రాణించేందుకు అవకాశం ఉంటుందని సీడీపీవో రమణ కుమారి అన్నారు. 53వ వార్డు ఆర్ అండ్‌బీ సమీపంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం కిశోర వికాసంపై ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు,వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ,నోడల్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాలికల వికాసంపై నిరంతం శ్రద్ధ వహించాలన్నారు. చక్కటి పోషకాలు కలిగిన ఆహారాన్ని వారికి అందించి వారి ఎదుగుదలకు సహాయపడాలన్నారు.

ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



కర్రివాని గెడ్డపై తొలగించిన పాత బ్రిడ్జి

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో కర్రివాని గెడ్డపై బాక్సు కల్వర్టు నిర్మాణ పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గెడ్డపై ఉన్న బ్రిడ్జి శిథిలమవడంతో కొత్త బ్రిడ్జి నిర్మించాలని స్థానికుల కోరిక మేరకు వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చొరవతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.50 లక్షలు మంజూరు చేసింది. పనులు ప్రారంభమయ్యేలోగా ఎన్నికలు రావడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మరలా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వార్డు కార్పొరేటర్ ,స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు రావడంతో శుక్రవారం పాత బ్రిడ్జి తొలగింపు పనులు పూర్తి చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో 16 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూర్ జిల్లాకు చెందిన రాధాకృష్ణన్, కార్తీక్ సెల్వం, అరుణ్ మోహన్, కార్తీ బాలకృష్ణన్ బ్యాగులను తనిఖీ చేయగా.. 16 కిలోల గంజాయి లభ్యమైంది. వీరిని అరెస్టు చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఒబిషేక్ మిస్త్రీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.